కథ

గోపీకృష్ణ పుట్టగంటి

# మనసు పరిమళించెనే...

అనంత విశ్వంలో... కోట్లాది పాల పుంతల మధ్య... మనిషిని పోలిన బుద్ధిజీవి మరెక్కడైనా ఉందా? అని సాగిస్తున్న అన్వేషణ కొనసాగుతూనే ఉంది.

అనేకమార్లు రోదసిలోకి రేడియో తరంగాల ద్వారా 'సందేశాలు' పంపిన శాస్త్రవేత్తలు ఏనాటికైనా బదులు రాక పోతుందా అని ఎదురుచూస్తూనే ఉన్నారు. అంతకన్నా చెయ్యగలిగింది ఏమీ లేదు కనుక.

★ ★ ★

డాబా మీద నుంచుని చుట్టూ పరిశీలించి చూశాడు అభి. చలికి ఊరంతా వణుకుతోంది. వణుకుతున్న ఊరి మీద దుప్పటి కప్పినట్లు పొగమంచు పరుచుకుంటోంది.

డాబాకి ఒక చివర కొత్తగా కట్టిన బెడ్‌రూమ్ ఉంది. అది తప్ప మిగిలిన స్థలం అంతా ఖాళీగానే ఉంది. ఒక వైపు డాబామీదకి వంగిన కొబ్బరి చెట్టు, నెలలు నిండిన స్త్రీలాగా కాయల బరువుకి ఆపసోపాలు పడుతోంది. మరొకవైపు పిట్టగోడ మీదకి పాకిన సన్న జాజి తీగ దోసిళ్లతో పరిమళాన్ని గుమ్మరిస్తోంది.

మూడు రోజుల క్రితం పెళ్లయింది అభికి అనుజతో... కొన్ని నిమిషాల ఎడబాటు కూడా విరహవేదన రగిలిస్తుంటే, అను కోసం ఎదురు చూస్తూ అటు ఇటూ పచార్లు చేస్తున్నాడు.

★ ★ ★

ఆకాశంలో సుమారు అయిదువేల మీటర్ల ఎత్తున ఒక అంతరిక్ష నౌక స్థిరంగా నిలబడి ఉంది. ఒక సాసర్ మీద ఇంకొక సాసర్ బోర్లించినట్లుంది దాని ఆకారం. మానవాళికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానానికి దొరకనన్న ధీమానో భూమ్యాకర్షణని జయించిన ధైర్యమో కానీ నిశ్చలంగా, నిర్భయంగా నిలబడి, తన దృష్టిని కిందకి సారించి దేనికోసమో వెదుకుతున్నట్లుంది.

దానిలో రెండు జీవులున్నాయి. అవి ఆకారంలో, పరిమాణంలో మానవులకి ఏమాత్రం సాపత్యం లేకుండా ఉన్నాయి. వాటి ఎత్తు నాలుగున్నర అడుగులు మించి ఉండదు. మొత్తం శరీరంలో మూడో వంతు దాని తలే ఆక్రమించింది. అవసరం లేని అవయవాలు క్రమేపీ కనుమరుగవుతాయన్న సిద్ధాంతం వాటికి కూడా వర్తిస్తుందో లేదో తెలవదు. కానీ వాటి తలలో అత్యధిక భాగం మెదడు, కళ్లు ఆక్రమించగా... నోరు, ముక్కు, చెవులు చాలా చిన్నగా ఉన్నాయి.

అవి బుద్ధిజీవులే కానీ, శ్రమజీవులు కాదని, బలహీనంగా ఉన్న వాటి చేతులూ, కాళ్లూ చూస్తే అర్థమయిపోతుంది.

వాటిలో లింగభేదాలున్నాయో లేదో కానీ, కనీసం ఆకారాల్ని చూసి అయితే పోల్చుకోలేని విధంగా ఉన్నాయి. దానిలో ఒక దాని పేరు 'ఎమ్మెస్ 32' అయితే ఇంకొక దాని పేరు 'ఎల్కే 326'.

'మనం దేని కోసం ఎదురుచూస్తున్నామో నాకు అర్థం కావటం లేదు. ఈ గ్రహం మీద జీవం ఉందనీ, అందులో మనిషి అనే ప్రాణి అభివృద్ధి దిశలో ముందడుగు వేస్తున్నాడనీ, అయినా మనం సాధించిన అభివృద్ధికి కొన్ని వేల సంవత్సరాల దూరంలో ఉన్నారని తేలిపోయింది. అదే విషయం మనం రిపోర్ట్ చేస్తే, మనకి చెప్పిన పని పూర్తి చేసినట్లవుతుంది" ఎమ్మెస్ 32 తన తోటి ప్రాణితో అంటుంది.

వాళ్లు మాటలు నోటి ద్వారా మాట్లాడుకోవటం లేదు. ఆలోచనలని ఎలక్ట్రో మాగ్నటిక్ తరంగాల ద్వారా ఒకరికి ఒకరు చేరవేసుకుంటున్నారు.

"నేను కూడా కాసేపటి క్రితం వరకు అదే అనుకున్నాను. కానీ ఈ మనుషులని దగ్గరగా పరిశీలించే కొద్దీ వారిలో మనకు లేని భావావేశాలు కనిపిస్తున్నాయి. వెనుకబడి ఉన్నది వారో, మనమో అర్థం కావటం లేదు"

"నీ మాటలు వాస్తవానికి దూరంగా ఉన్నాయి. మనం మన చరిత్రలో చదువుకోలేదా! కొన్ని వేల సంవత్సరాల క్రితం వరకూ మన జాతిలో కూడా ఈ భావావేశాలు ఉండేవని. ఆ స్థాయిలన్నిటినీ అధిగమించి ప్రస్తుతమున్న దశకి చేరుకున్నాం. కచ్చితంగా ఈ మనుషులు వెనుకబడే ఉన్నారు"

"ఏమో నాకయితే అలా అనిపించటం లేదు. వారి ఆనందాలనీ, బాధల్నీ, కోపాన్నీ దగ్గరగా గమనించాను. ఇవన్నీ లేని మన జీవితాల కంటే, వీళ్లు చాలా సుఖంగా ఉన్నారనిపిస్తుంది"

"వీళ్లు సుఖంగా ఉన్నారా? మన సాంకేతిక అభివృద్ధి, మనకున్న సౌలభ్యాలు, జీవన ప్రమాణాల ముందు వీరు జీవిస్తున్న జీవితాలు ఎంత వెనుకబడి ఉన్నాయో గమనించలేదా?"

"నిజమే! వీళ్ల జీవితాల్లో హాస్యం ఎంత ఉందో, దుఃఖం కూడా అంతే ఉంది. ఆనందాల్ని వెన్నంటే బాధలూ ఉన్నాయి. అయినా అవన్నీ సరే... ఒక్కసారి అదుగో... అక్కడ కనిపించే జంటని చూడు. వారి మధ్య ప్రేమని చూడు. ప్రేమ నుంచి జనించిన శృంగారాన్ని చూడు. అన్ని భావావేశాలలోకి అద్భుతమైన ప్రేమావేశాన్ని దూరాన్నుంచయినా గమనించు. అప్పటికీ నీకు మన జీవితాలే బాగున్నాయనిపిస్తే, అప్పుడాలోచిద్దాం!"

★ ★ ★

అప్పుడే తలారా స్నానం చేసినట్లుంది, పూర్తిగా తడి ఆరని వెంట్రుకల్ని విరబోసుకుంది అనుజ. కట్టుకున్న తెల్లచీర మీద వెన్నెల ప్రతిఫలిస్తోంది. ఒక చేత్తో కుచ్చిళ్లు ఎత్తి పట్టుకుని, మరో చేత్తో పాల గ్లాసుతో, కాలి అందెలు ఘల్లుమంటుంటే మెత్తగా మెట్లు ఎక్కి వస్తోంది. ఆ నడకలో ఒద్దికా, సొగసు కలగలసి నర్తిస్తున్నాయి.

అభికి, ఆమెను చూడగానే వెన్ను కింద నుండి పాకిన పులకరింత గుండెని చేరి, గుండె వేగాన్ని రెట్టింపు చేసింది.

పాలగ్లాసు గదిలో పెట్టి బయట నిలబడి ఉన్న అభి దగ్గరకి వచ్చింది అనుజ.

"ఏమిటి... ప్రకృతి అందాలని ఒడిసిపట్టి, ఆస్వాదించే ప్రయత్నంలో ఉన్నట్లున్నారు?" అభి చేతిని తన చేతిలోకి తీసుకుని అతనికి అభిముఖంగా నిలబడుతూ అంది.

"ఇలాంటి రాత్రులు ఇంతకుముందు ఎన్ని చూడలేదు? కానీ నువ్వు పక్కనుంటే అన్నీ కొత్తగా ఉన్నాయి"

"అభి.. ఈ డాబా మీదే నా చిన్నతనమంతా గడిచింది. అప్పుడెప్పుడూ కనిపించని అందాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. రెండేళ్లు కాంక్రీట్ జంగిల్ మధ్య గడిపేటప్పటికి, ఇప్పుడు దీని విలువ తెలిసి వచ్చింది"

ఊరి మధ్య చెరువు... చెరువులో ప్రతిఫలిస్తున్న చంద్రుడూ... చెరువు పక్కన వేణుగోపాలస్వామి ఆలయం... ఆలయం ముందు ధ్వజస్తంభం మీది చిరుగంటల చప్పుడూ... మిద్దె మీదకి ఒరిగిన సన్నజాజి తీగ గుబాళింపు...

మరొకసారి ఆ ఊరి అందాలని ఆస్వాదించటానికా అన్నట్లు, అనుజ పిట్టిగోడ మీద చేతులు వేసి



ముందుకు ఒంగింది.

విల్లులా ఒంగిన భార్య శరీర భంగిమ, కాయల బరువుతో ఒరిగిన కొబ్బరిచెట్టును తలపింపజేస్తోంది. పై నుంచి జారిన ఒక చంద్రకిరణం తెల్లచీర మీద పరావర్తనం చెంది, నడుము మడతలో విచ్ఛేదనమయి సప్తవర్ణాలుగా భాసిస్తోంది.

నడుము మడతని తాకిన అభి వేళ్లు నాభి వరకూ సాగాయి. శరసంధానం పూర్తి కావడంతో నిటారుగా అయిన విల్లులా చివుక్కున నిలబడింది అనుజ. నాభి లోతుల్ని పరిశీలించిన చేయి, ఎద ఎత్తుల్ని కొలవబోవటంతో, స్పృహలోకొచ్చినట్లు చటుక్కున అభి చేతి మీద చెయ్యి వేసింది అనుజ.

"అన్నీ ఇక్కడేనా... లోపలకి వెళ్దాం రండి"

"ఇక్కడ మాత్రం ఎవరు ఉన్నారు? పైన చందమామ తప్ప"

ఒకసారి పైకి చూసింది అనుజ. "ఏమో బాబూ.. నాకెవరో చూస్తున్నట్లు అనిపిస్తుంది ఇక్కడుంటే" అంటూ లోపలికి దారి తీసింది.

మంచం మీద దుప్పటి కనపడకుండా పరిచిన మల్లెపూలు, ఏసీలోంచి వస్తున్న సుగంధాన్ని ఛాలెంజ్ చేస్తోంది.

అనుజ తలుపులు వేస్తుంటే, అభి కిటికీ తలుపులు తెరిచాడు. వెన్నెల రూమంతా పరుచుకుంది.

అనుని దగ్గరికి తీసుకుని గాఢంగా హత్తుకున్నాడు. ఇద్దరి నిట్టూర్పులూ వేడి కొలిమిలోంచి వస్తున్నట్లు వేడెక్కి చలిని దూరం చేస్తున్నాయి.

అను గుండెలు ఎగిసిపడుంటే బుగ్గలు గులాబి వర్ణానికి మారిపోయాయి.

ఆమె కళ్లు బరువెక్కి మూతపడుతుంటే, పెదవులు అదురుతూ తెరుచుకుంటున్నాయి.

అతని చేతులు ఆమె శరీర

అవయవాల్ని తడుముతుంటే, ఆమె పెదవులు అతని పెదవులకై వెదుకుతున్నాయి. ఆమెకు తెలియకుండానే అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

రెండు రోజుల అనుభవమే అయినా, అభి వేళ్లు లాఘవంగా అందాలని బంధించిన శృంఖలాల్ని వదిలిస్తున్నాయి. రెండు నిమిషాలలో వంటి వేడికి దూరమైన వలువలు, రూము మూలకి చేరి వణుకుతున్నాయి.

అతని పెదవులు ఆమె నుదుటి మీదుగా కళ్లను స్పర్శిస్తూ, పెదవుల వద్ద కాసేపు మకాం పెట్టాయి. కాసేపటికి తనివితీరనట్లు కిందకి దిగిన తల, శంఖం లాంటి మెడ మీద జర్రున జారి, వక్షోజాలు అడ్డు రావటంతో ఆగిపోయింది.

ఇద్దరి మోహం తీరేటప్పటికి, ఆమె అతని భుజం మీద తల ఆన్చి పడుకుని ఉంది. ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ ఇంకా సాధారణ స్థాయికి రాలేదు. ఆమె మొహంపై అతుక్కున్న స్వేద బిందువులు, మంచు ముత్యాలను తలపింప చేస్తున్నాయి. తన పెదవులతో ఆ ముత్యాలను ఏరుకుంటున్నాడు అభి.

అభికి ఆమె అందంలో సొగసుతోపాటు ఆత్మీయత కనిపిస్తే, అనుజకి అతని కళ్లలో చురుకుదనంలో మిళితమైన కారుణ్యం అగుపిస్తుంది.

"అనూ... మనం జీవితాంతం... ఎన్ని సమస్యలొచ్చినా ఇలాగే ఉండాలి... ఉంటానని ప్రమాణం చెయ్యి"


"ఇలాగే అంటే... ఇలాగా..." తాము ఉన్న భంగిమని చూపిస్తూ అంది అనుజ, "చాలా ఛండాలంగా ఉంటుందేమో..."

"ఛ...ఛ... బుద్ధూ! నేను చెప్పేది కేవలం శృంగారం గురించే కాదు. మన మధ్య ప్రేమ గురించి. అది ఎప్పటికీ తరగదనీ, మిగిలిన ప్రాపంచిక విషయాలకీ, ప్రేమకీ ముడి పెట్టమనీ, ఒకరికొకరం ప్రామిస్ చేసుకుందాం... జీవితాంతం ఇలాగే ఉండాలనుకుందాం. కనీసం ఉండటానికి ప్రయత్నం చేద్దాం"

సరేనన్నట్లు గాఢంగా అభి బుగ్గ మీద ముద్దు పెట్టి సమ్మతి తెలియజేసింది అనుజ.

* * *

దూరంగా వీరిని గమనిస్తున్న గ్రహాంతర వాసులకి, గది లోపలి విషయాలు పరిశీలించటం పెద్ద విషయం కాదు కాబట్టి, జరిగేదంతా చూస్తూనే ఉన్నారు. ఏదో తెలియని భావం కొద్దిసేపు వారి భావ వ్యక్తీకరణని అడ్డుకుంది.




"ఇప్పుడు చెప్పు... ఇంకా మనమే అభివృద్ధి జీవులమనీ ఈ మనుషుల కంటే చాలా ముందుకు వెళ్లిపోయామనీ అనుకుంటున్నావా?" అడిగింది ఎల్మే 326.

తల అడ్డంగా ఊపింది మరో జీవి. "అభివృద్ధి పేరుతో మనం కోల్పోయిందేమిటో వీరిని చూస్తే అర్థమవుతుంది. మనని మనం మిగిలిన ప్రాణుల కంటే అభివృద్ధి జీవులమని చెప్పుకోవటానికి చేసిన ప్రయత్నంలో ప్రకృతిని ఎదిరించాం. గెలిచామని అనుకున్నాం. కానీ ఒక్కొక్క విజయంతో మనసులో ఒక్కొక్క పొర కరిగిపోయింది. ఇప్పుడు మనకి గుండె ఉంది, మెదడు ఉంది. రెంటి మధ్య ఉండవలసిన మనసు మాత్రం మాయమైపోయింది. వ్యక్తిగత ఆనందాన్ని వికాసాన్ని పణంగా పెట్టి మనం సాధించిన ఈ ప్రగతి ఎంత అల్పమయిందో ఇప్పుడు తెలుస్తోంది"

"ఇప్పుడు మనం ఈ గ్రహం గురించి మనవాళ్లకి చెప్తే జరిగేదేమిటి? బహుశా మనవాళ్లు వీళ్లని అభివృద్ధి పథంలో ముందుకెళ్లటానికి సాయం చేస్తున్నాం అనుకుంటూ మనకి నకళ్లుగా తయారుచేయవచ్చు. ఈ మానవులు కూడా ప్రాపంచిక సుఖాల మీద జిజ్ఞాసతో మనవాళ్లు ఏది చెప్తే అది చేసి, మనని అనుకరించటమే నాగరికత అనుకోవచ్చు. కాబట్టి మనం వీరి ఉనికిని రహస్యంగా ఉంచటమే శ్రేయస్కరం"

"అప్పుడయినా ఏం లాభం... ఈ మనుషులు పయనిస్తున్న దారి, అంతిమంగా వీరిని కూడా మన లాగే మనసులు లేని మనుషుల్ని చేస్తుంది కదా! దానిని ఆపగల శక్తి ఎవరికి ఉంది?"


"నిజమే... కాకపోతే వారి దారిన వారిని వదిలేస్తే, ఆ ఉత్పాతం జరగటానికి ఇంకా కొన్ని వందల సంవత్సరాలు పట్టవచ్చు. ఈలోపు ఏ మహానుభావుడో జన్మించి వీళ్లలో మార్పు తేవచ్చు. అంతవరకూ వీరికి మనం కనపడకూడదు. మన ఉనికి తెలపకూడదు. అదే మనం వీరికి చేయగల ఉపకారం"

అవునన్నట్లు తల ఊపింది ఎమ్మెన్ 32.

వారు పయనిస్తున్న అంతరిక్ష నౌక వేగంగా పైకి దూసుకుపోయింది.

దూరమవుతున్న భూమిని చూస్తున్న ఎమ్మెన్ 32 కంటి నుండి ఒక నీటి చుక్క జారి పడింది.

బహుశా అది మార్పుకి ఆరంభం కావచ్చు. మనకి తెలియకుండా, మన దారిలో నడుస్తూ, మనని అనుసరించాలనే జీవులు ఎక్కడో తయారవుతూ ఉండి ఉండవచ్చు.



## కలిసొచ్చేనా?

ఇటీవల అమీషా పటేల్ తన పోష్ ఫ్లాట్‌ని అమ్మేసిందిట. దీంతో ఆమె సినిమాలకు గుడ్‌బై చెప్పేసి పెట్టేబేడా సర్దుకుని న్యూఢిల్లీలో సెటిలైపోతుందని అంతా ఊహించారు. కానీ అసలు సంగతి అది కాదట. తన బాయ్‌ఫ్రెండ్ విక్రమ్‌భట్‌తో తను కలిసి వున్న ఆ ఫ్లాట్ తనకి 'కలిసి' రాలేదని అందుకే ఇద్దరూ దూరమయ్యారని, దీంతో ఆ ఫ్లాట్‌ని అమ్మేయమని కొంతమంది శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహామీద ఫ్లాట్‌ని అమ్మేసి మరో చిన్న ఫ్లాట్‌ని కొనుక్కుని అందులోకి అమీషా షిఫ్ట్ అయిందిట. మరి కొత్త ఇల్లయినా కలిసొస్తుందేమో!